# మన కార్యకర్తలే అవయవాలు

(పరమపూజ్య గురుదేవులు అప్పుడప్పుడు సూచించే మహత్వపూర్ణమైన సూచనలు ప్రతి సమాజసేవకునకు కార్యకర్తకు, సహకారశీలికి, సమర్పణ భావం కలిగియున్న శిష్యునకు వర్తిస్తాయి. కార్యకర్త యొక్క ఆలోచన జీవనశైలి ఏవిధంగా ఉండాలో ఖచ్చితంగా సూచిస్తారు).

ప్రియమైన కార్యకర్తలారా,

ఈ మనోభావనలన్నిటిని నాచేతియందలి మూడు వ్రేళ్ళు కలసి వ్రాస్తున్నాయి. వ్రాయబడిన భావనలన్నింటినీ అవే వ్రేళ్ళు, కలము, కాగితములే కార్యరూపంలో పెడతాయని మాత్రం భావించరాదు. చేయవలసిన బాధ్యత మీదే. మీలోని నిష్ఠాగరిష్ఠులైన కార్యకర్తలదే.

ఇంతటి విశాలమైన యోజనకు పరమేశ్వరుడే ప్రేరణ కల్పించాడు. ఏదో దివ్యశక్తి చెప్పడం, వ్రాయడం, చేస్తూ ఉంది. మెదడులోని, హృదయంలోని కణకణం కొంచెం కొంచెం వ్రాస్తున్నాయి. వ్రాయడమే కాదు, లక్ష్యాన్ని నెరవేర్చేటందుకు పడుగు-పేకలను కలిపి ఉంచుతున్నాయి. లక్ష్యాన్ని నెరవేర్చడంలో ఎంతమంది ఎన్నిరకాల ఆలోచనలు చేయాలో, ఎంతెంత శ్రమపడాలో, ఎంతెంత సమయాన్ని వినియోగించాలో, ఎన్నెన్ని సాధనాలు కావాలో చెప్పడం చాల కష్టం. వ్రాయటానికి ఉపయోగపడే వ్రేళ్ళు లేకున్నా, కాగితాలు-కలము లేకున్నా కూడ పని ఆగిపోదు. ఎందుకో తెలుసా? రక్తంలోని ప్రతి కణము, మెదడులోని ప్రతి అణువు లక్ష్యాన్ని వెన్నంటి ఉంటాయి. ఇంతే కాదు. దైవశక్తి అనేది మనకంటికి కనిపించదు. కాని అన్నివేళలా సచేతనమై ఉంటుంది. మనలను చైతన్య పరుస్తూ ఉంటుంది.

యోజన అనేది చాల పెద్దది. "యుగపరివర్తన" ఎంత పొడవైనదో, ఎంత విశాలమైనదో "యోజన" అంత పెద్దది. యుగపరివర్తన కొరకు శ్రేష్ఠులైన అనేకమంది కలిసి పని చేయాలి. వారి శ్రమ ఫలితము అనేకమందికి లభిస్తుంది. ప్రస్తుత యోజనను అనేకమార్లు చదివి అర్థం చేసుకోవాలి. ఈ శరీరాన్ని కేవలం అవయవాలుగా భావించిన వారి సహాయ సహకారాలే ఎక్కువగా కావాలి. ఎందుకంటే అవయవాల సమన్వయ శక్తియే వ్యక్తి. ఆ వ్యక్తియే ఈ యోజనను సిద్ధంచేశాడు. లక్ష్యం ఏ విధంగా పూర్తి అవుతుంది? ఇన్ని సాధనాలు ఎక్కడ నుండి వస్తాయి? అని మీరు ఆలోచించి భయపడనక్కరలేదు, చేయమని చెప్పిన దైవమే అన్ని సమకూర్చిపెడతాడు. మీరు మాత్రం ఒక్క విషయం మీదే శ్రద్ధ చూపాలి. మిమ్మల్ని మీరు అర్పించుకోవడంలో, శ్రమించడంలో ఒకరిపై ఒకరు పోటీపడుతూ ఉండాలి. ప్రతి ఒక్కరు కూడ అందరి కన్న ముందుండాలని ఆరాటపడుతూ ఉండాలి.

సాధన, యోగ్యత, విద్వత్తు మొదలైన వాటిని దృష్టిలో పెట్టుకోవాలంటే హనుమంతుడు ఇవేమీ లేని వాడే. శ్రీరామునితో పరిచయం కాక మునుపు ఆయన కాలమంతా పిరికివాడైన సుగ్రీవునికి సేవ చేయడంలోనే గడిచిపోయింది. కాని మహాశక్తిమంతుడైన శ్రీరామునికి మనస్ఫూర్తిగా తనను తాను సమర్పించుకోగానే మహాశక్తిమంతుడయ్యాడు. సముద్రాన్ని లంఘించ గలిగాడు. లంకా దహనం చేయగలిగాడు. పర్వతాలను పెకలించ గలిగాడు. రామలక్ష్మణులను భుజాలపై కూర్చుండపెట్టుకుని తిరుగ గలిగాడు. మీ నుండి నేను ప్రత్యేకంగా ఆశించేది ఒక్కటే. ప్రతి సాధకుడు ఒక్కొక్క హనుమంతుడు కావాలి. కర్తవ్య నిర్వహణలో మిమ్మల్ని మీరు సంపూర్ణంగా అర్పించుకోవాలి.

మేమేం చేయాలి? అన్న ప్రశ్న మీముందుకు అప్పుడప్పుడు వస్తూఉంటుంది. పనులు ఎప్పుడూ కూడ సమయానుకూలంగా మారుతూనే ఉంటాయి. మధ్యమధ్యలో విఘ్నాలు వస్తూనే ఉంటాయి. కాని మీరు దీనిలో ప్రవేశించేటప్పుడు ఏ సమర్పణ భావంతో బయలుదేరారో దానిని ప్రతి క్షణం స్మరిస్తూ ఉండాలి. రానురాను పెరుగుతూ ఉండాలే గాని, మీ లక్ష్యాన్నుండి అవగింజంత కూడ వెనుకకు తగ్గకూడదు.

మన కార్యక్షేత్రం చాల విశాలమైనది. "ఇంతవరకు" అని ఒక హద్దును చూపించలేనంత పెద్దది. అయినప్పటికీ మనం అవతలి ఒడ్డుకు తప్పక చేరుకుంటాం. దీనినే అద్భుతం, అనుపమానం, అసాధారణం అని చరిత్రలో వ్రాసుకుంటారు. అయితే గొప్ప సాధన జరగాలి. ఇది మాత్రం సత్యం. భారమంతా దివ్యశక్తిపైన ఉంచి మనం ఉద్యమించాలి. మన శ్రమ, సమయం, ఆలోచన, క్రియ, స్వభావం దేనిలో కూడ లేమిని చూపించరాదు. "విశ్రాంతి"అనే మాటను పూర్తిగా మర్చిపొండి. అహర్నిశలు ఒకే ఒక ఆలోచన చేస్తూ ఉండాలి. ప్రస్తుత కార్యంలో నేనెంత సహకరించ గలను? ఎంత ముందుకు సాగిపోగలను? నేనెంత బరువును మోయగలను? ఈ ప్రశ్నలకు సమాధానాలను వెతుక్కుంటూ ఉండాలి. ఎవరికి వారే వినమ్రంగా ఉంటూ ఇతరుల గొప్పదనాన్ని గౌరవిస్తూ ఉండాలి. స్వయంసేవకులుగా మనలుకోవడంలో గౌరవాన్ని గుర్తించాలి. అందులోని గొప్పతనాన్ని మననం చేసుకోవాలి.

మీరెప్పుడూ మీ సౌకర్యాల గురించి ఆలోచించవద్దు. అలసట గురించి భయపడవద్దు. చేసిన పనిని గుర్తు చేసుకుంటూ అహంకారంలో పడిపోవద్దు. " నా శ్రమ ఎంతవరకు ఫలించింది? " అన్న విషయం మీదనే శ్రద్ధ నుంచాలి.ఇదే మీకు అగ్ని పరీక్ష. మీ కృషి ఎప్పటికీ " మూడు పూవులూ - ఆరు కాయలూ" అన్నట్లుగా సాగిపోవాలి. సంస్థ యొక్క కార్యక్రమాలు రాబోయే రోజుల్లో ఇంకా ఇంకా పెరిగిపోతాయి. అంతంకాదిది. ఆరంభం. ఇప్పటి కన్నా ఎన్నోరెట్లు శ్రమించాల్సి ఉంటుంది. మహోన్నత తీరాలకు చేర్చవలసి ఉంటుంది. మనల్ని మనం కృతార్థులుగా భావించి ఆనందించాల్సిన రోజులు ముందున్నాయి. రామపంచాయతనంలో ఆరవవానిగా వచ్చి దూరిన హనుమంతుని వలె ప్రేరణాశక్తి మీలో ప్రవేశించాలి.

ఇంతకూ నేను చెప్పేదేమిటంటే మీరు ప్రతి నిత్యము "నా సాధనలో ఏమైనా లోటుపాట్లున్నాయా?" అని అంతరాత్మను ప్రశ్నించుతోవాలి. నియమపాలనను గూర్చి అంతర్మథనం జరగాలి. "నేను అందరికన్నా గొప్పవాడిని" అన్న అహంకారాన్ని ప్రవేశించనీయకుండా జాగ్రత్త పడాలి.

పైవిధంగా నడచుకున్నట్లయితే మనం తలపెట్టిన విస్తృతమైన యోజన తప్పక ఫలిస్తుంది. మనందరికి ఇది అగ్నిపరీక్షా సమయం. త్రికరణశుద్ధిగా అందరం కలసి పనిచేయవలసిన సమయం. ఉన్నతాశయాలెప్పుడూ మహోన్నత కార్యాలనే చేపడతాయి. కేవలం ఎత్తుగా ఉండటమే ఉన్నతత్వం అని అనుకోకూడదు. మనోవాక్కాయ కర్మలా పనిచేసిన నాడే ఉన్నతత్వం సిద్ధిస్తుంది. ముందు ముందు చేయాల్సిన పని చాల ఉన్నతమైనది. మీ ఉన్నతత్వం దానిని మించిపోవాలి. ఇదే ఆశతో, ఇదే కోరికతో, ఇదే నమ్మకంతో సమాజం మీ వైపు చూస్తూ ఉంది. వెనుకడుగువేయకుండా ముందుకు సాగండి.

నడవండి ముందుకు.

నడవండి ముందుకు.

నడవండి ముందుకు.

- విచారక్రాంతి అభియాన్ - గాయత్రీ తీర్థ్ - శాంతికుంజ్ - హరిద్వార్ (ఉత్తరాంచల్)

South India Cell
Shantikunj, Haridwar
Uttaranchal-249411
Ph. No. 01334-260602